క్లుప్తంగా

కోర్టుకు బీజేపీ నాయకుల హాజరు



అయిజ: బీజేపీ నాయకులు గురువారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. 2022 సంవత్సరంలో మాజీ సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. పోలీసులు మొత్తం 18 మంది బీజేపీ నాయకులపై కేసునమోదు చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి 15సార్లు కోర్టుకు హాజరయ్యారు. గురువారం 17మంది కోర్టుకు హాజరుకాగా, ఒక్కరు గైర్హాజరు కావడంతో కేసు మళ్లీవాయిదా పడింది,

మెకానిక్‌లు వైద్యులతో సమానం



అయిజ: వాహనాలను రిపేర్‌చేసే మెకానిక్‌లు వైద్యులతో సమానమని తహసీల్దార్ జ్యోతి అన్నారు. గురువారం మండలకేంద్రంలో ప్రపంచ టూ వీలర్ మెకానిక్స్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్, ఎస్సై శ్రీనివాసరావు, అలంపూర్ మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతిమనిషికి వాహనం ఉంటుందని, వాటికి సాంకేతిక సమస్య తలెత్తుతే మెకానిక్‌లు మాత్రమే పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, భగత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శేక్షావలి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, అమరవాయి, మానవపాడు తదితర గ్రామాల్లో గురువారం ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు.

ఓటర్ జాబితాలో తప్పులు ఉండొద్దు



అయిజ: బీఎల్‌వోలు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి, నిబంధనల ప్రకారం పనిచేయాలని ఆర్డీవో అలివేలు అన్నారు. గురువారం మండలంలోని ఉత్తనూరు గ్రామంలో తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. కొత్త ఓటర్లను ఓటరు జాబితాలో నమోదుచేసే విధానాన్ని వివరించారు. మృతిచెందిన, వివాహమైన వారి పేర్లతో పాటు ఒకటికంటే ఎక్కువసార్లు నమోదైన పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ రజినీకాంత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ నాయకుల సమావేశం

గట్టు : మండలకేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు రామునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికసంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతునాయుడు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

పశువుల నీటితొట్లు ఉపయోగంలోకి తేవాలి



మల్దకల్: మండలంలోని అమరవాయి, బూడిదపాడు, శేషంపల్లి, బిజ్వారం, ఎద్దులగూడెం గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. గతంలో వీటిలో నీటిని నింపుతుండడంతో పశువుల దాహార్తి తీర్చేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేవని గ్రామస్తులు తెలిపారు. కానీ ప్రస్తుతం పైపులైన్ కనెక్షన్ లేకపోవడంతో చెత్తకుండీలుగా మారాయన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని పాడి రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు పైపులైన్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా కంపోస్ట్ షెడ్లు

- చెత్త సేకరణలో జాప్యం
- ఎక్కడికక్కడే చెత్త కుప్పలు
- ప్రచారానికి పరిమితమైన అధికారులు



కేటీదొడ్డిలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

కేటీదొడ్డి: 'చెత్త బండి వచ్చిందమ్మా.. తడి, పొడి చెత్తను వేరువేరుగా వేయండమ్మా' అంటూ తిరిగే పంచాయతీ వాహనాల్లో చేసే ప్రచారం నామమాత్రంగా మిగిలిపోయింది. మండలంలోని వివిధ గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోడ్డు పక్కనే చెత్తను డంపు చేస్తుండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. చెత్త సేకరణపై అధికారులకు పట్టింపు లేకపోవడంతో స్వచ్ఛ గ్రామాల ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది.

కానరాని చిత్తశుద్ధి

విడివిడిగా తడి, పొడి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ఇంటింటికీ రెండు బుట్టలు అందించింది. మండలంలోని 23 గ్రామాల్లో 23 డంపింగ్ యార్డులు, కంపోస్ట్ షెడ్డులు నిర్మించారు. కానీ ఇప్పటి వరకు మండలంలో రెండు, మూడు గ్రామాల్లో తప్ప తడి, పొడి చెత్తను వేరుచేస్తున్న దాఖలాలు లేవు.

చెత్తకు నిప్పు..

మండల వ్యాప్తంగా 23 గ్రామాల్లో పంచాయతీకి ఒకటి చొప్పున డంపింగ్ యార్డులను ఆనుకొని చెత్త ఏరివేత షెడ్డు నిర్మించారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.50లక్షలు కేటాయించింది. కానీ డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరుగా వేయాల్సిన సిబ్బంది రెండింటినీ కలిపి శివారులోకి తరలించి నిప్పు పెడుతున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. అలాగే చెత్త నిప్పు పెట్టడంతో వెలువడుతున్న వాసన, పొగతో వాయు కాలుష్యం ఏర్పడుతుంది. దీంతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను రీసైక్లింగ్ చేసి, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతున్నారు.



కేటీదొడ్డి శివారులో పారబోసిన చెత్త

రీసైక్లింగ్ చేయాలి



గ్రామాల్లో రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన డంపింగ్ యార్డులను వినియోగంలోకి తేవాలి.సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి డంపింగ్ యా ర్డులో రీసైక్లింగ్ చేయాలి. చెత్తకు నిప్పు పెట్టడంతో పొగతో ఇబ్బంది పడుతున్నాం.అధికారులు స్పందించి నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– వీరన్న, కేటీదొడ్డి

వినియోగంలోకి తెస్తాం

సెగ్రిగేషన్ షెడ్లు కొన్ని గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న మాట వాస్తమే. వాటిని త్వరలోని వినియోగంలోకి తీసుకొస్తాం. చెత్తను వేరు చేసి ఎరువులు తయారు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడతాం.

– కృష్ణమోహన్, ఎంపీడీఓ

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



గట్టులో మాట్లాడుతున్న ఏడీఏ సంగీతలక్ష్మి



అలంపూర్‌లో రాయితీ విత్తనాలు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఏఓ నాగార్జునరెడ్డి

అలంపూర్: ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. అలంపూర్ పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో రైతులకు ఆహారభద్రత పథకం కింద వందశాతం రాయితీపై గురువారం కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి, ఏవో నాగార్జున్‌రెడ్డి రైతులకు రాయితీ విత్తనాల మినికిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అధికారులు ఉన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

గట్టు : ఎరువులను అధిక ధరలకు విక్రయించే దుకాణాలపై చర్యలు తప్పవని ఏడీఏ సంగీతలక్ష్మి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో రైతు వేదికలో ఎరువుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో దుకాణదారులు కావల్సినంత ఎరువులను అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ధరల వివరాలను నోటీసుపై ప్రదర్శించాలన్నారు. బస్తాలపై ఉన్న రేట్లకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో హన్మంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

మల్దకల్: నర్సరీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలను పెంచేందుకు నిర్వాహకులు ప్రత్యే క దృష్టి సారించాలని ఎంపీవో రాజశేఖర్ సూ చించారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించా రు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచి, వాటికి నిరంతరం నీరందించి సంరక్షించాలన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

గట్టు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో చిరకాల మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ మిత్రుడి కుటుంబానికి అండగా ఉండేందుకు గురువారం తమవంతు ఆర్థికసాయాన్ని అందజేశారు. గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వీరేశ్ (28) గత నెల 28 న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ కుటుంబానికి 2012 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు కలిసి పోగుచేసిన రూ.45,602లు వీరేశ్ కు టుంబానికి అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి పెద్దబాబు

అలంపూర్ : గ్రామాల్లోని ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పెద్దబాబు పిలుపునిచ్చారు. మండలంలోని ఉట్కూరు గ్రామంలో సీపీఐ కమిటీ ఎన్నిక గురువారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రామకమిటీ కార్యదర్శిగా బి.రాజు, సహాయ కార్యదర్శిగా సురేష్, సభ్యులుగా శివ, గణేశ్, మహబూబ్‌బాషా, చిన్న నరసింహా, నాగమద్దిలేటి, నరసింహా, మహేశ్, ప్రవీణ్, శివకుమార్, నరసింహా, సురేష్, మద్దిలేటి, భాగ్యమ్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి, పులేందర్, పరశురాముడు, నవీన్, సయ్యద్ అలీమియా, అడవన్న, చిన్నమద్దిలేటి, వెంకటేశ్వర్లు, మౌలాలి తదితరులు ఉన్నారు.


చినుకు పడితే చిత్తడే..



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని బునాదిపురంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి వర్షానికి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నరేందర్ ఆర్అండ్‌బీ ఏఈకి ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు.

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ధరూరు: పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాంప్లెక్స్ జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన ధరూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని దోర్నాల, సోంపురం, గుర్రోనిపల్లి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా దోర్నాల ప్రాథమిక పాఠశాల చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. చెత్త, పిచ్చి మొక్కలు పెరగడం ద్వారా విష పురుగులు పాఠశాల ఆవరణలోకి అవకాశం ఉందని, తద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అలాగే సోంపురంలో పాఠశాల ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న వంట గదిని పరిశీలించారు. వర్షాకాలంలో గోడలు తడిసి పడిపోయే అవకాశం ఉందని, అటు వైపు విద్యార్థులు వెళ్లకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గుర్రోనిపల్లిలో అసంపూర్తిగా ఉన్న వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలను పరిశీలిస్తున్న కాంప్లెక్స్ జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

కేటీదొడ్డి: ఇంటింటికీ కేంద్ర పథకాలను వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. మండలంలోని ఇర్కిచేడు గ్రామంలో గురువారం బీజేపీ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరెడ్డి మాట్లాడుతూ.. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, ఆహారభద్రత మిషన్, ఉచిత బియ్యం పంపిణీ, రక్షణరంగంలోని పౌరుల భద్రత, సీసీరోడ్లు, వీధిదీపాలు, శ్మశాన వాటికలు, అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ సైనిక శక్తి గురించి ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సూర్యకాంత్ రెడ్డి, రంగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మునెప్ప తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీపాదరెడ్డి

పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లి: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదికి వరద పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నరేష్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో విపత్తులపై మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అకస్మాత్తుగా సంభవించే విపత్తులతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం ప్రారంభమవ్వడంతో గ్రామాల్లో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లను గుర్తించి కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. నదీ ప్రవాహంలోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. గొర్రెలు, పశువుల కాపరులు వాటి మేపు కోసం నది, వాగుల సమీపంలోకి తీసుకుపోకూడదని సూచించారు. గ్రామాల్లో వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌సయ్యద్‌ఖాన్, వైద్యాధికారి రాధిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేష్

పాతపద్ధతిలో జీతాలు చెల్లించండి

- ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు భార్గవరెడ్డి

అలంపూర్ : మండల పరిషత్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లకు పాతపద్ధతిలో పంచాయతీ అకౌంట్‌ద్వారా జీతాలు ఇప్పించాలని ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు భార్గవరెడ్డి కోరారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే విజయుడును సంఘం నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భార్గవరెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందించడంతో ఆపరేటర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలో ఒక్కొక్క మండలంలో ముగ్గురు ఈ పంచాయతీ ఆపరేటర్లు ఉన్నట్లు తెలిపారు. కానీ గద్వాల జిల్లాలో మండలానికి ఒక ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో పనిభారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆపరేటర్లకు సమయానికి జీతాలు రావడం లేదన్నారు. ప్రతి నెలా పాతపద్ధతిలో వేతనాలు పెంచి ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, ఆపరేటర్లు శివకుమార్ నాయుడు, మోహన్‌గౌడ్, అశోక్, శాలిబాషా తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్ల సంఘం నాయకులు

ప్రధాన రహదారులు.. మురికి కూపాలు

అయిజ: పట్టణంలో మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఆయా కాలనీల్లో ప్రధాన రహదారులు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. గురువారం బీజేపీ నాయకులు మున్సిపాలిటీలోని 8వ వార్డులోని భరత్ నగర్‌కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిఏడాది ఇంటిపన్నులు చెల్లిస్తున్నాం. కానీ సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం లేదని కాలనీ వాసులు వాపోయారు. ఇంటిఎదుట మురుగుతో నిండిపోయిందని, కాలినడకకు వీల్లేకుండా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని, స్పందించకుంటే ప్రజల తరఫున నిరసన ప్రదర్శనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వీరేశ్‌గౌడ్, భగవంతు, రఘు, నరసింహ, వెంకటేశ్, గోపాల్‌రెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



మురుగును చూయిస్తున్న బీజేపీ నాయకులు

క్రీడా పాఠశాలకు మానస ఎంపిక

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న మానస ప్రభుత్వ క్రీడా పాఠశాలకు జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. గురువారం పాఠశాలలో మానసను హెచ్ఎం మునిస్వామి, ఉపాధ్యాయులు సుజాత, గరీబ్‌బాషా, రాణి, లీలావతి, మాసుంబీ, వెంకటాచలం, పీడీ శైలజ, శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

'మట్టి పరిచారు'

సాక్షి ఎఫెక్ట్..



ఇటిక్యాల: 'రోడ్డు వేశారు.. మట్టి మరిచారు' అనే శీర్షిక సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్త కథనానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించారు. గురువారం సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి వేసేలా ఆదేశించారు. దీంతో రోడ్డు ఇరువైపులా మట్టి వేయడంతో వాహనదారులు, గ్రామ ప్రజలు సాక్షి దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముందుకు సాగని 'బీటీ' పనులు

- 4 కి.మీ. రహదారికి రూ.3.50 కోట్లు
- కచ్చ రహదారితో రైతుల ఇక్కట్లు
- ఆరేళ్లు గడుస్తున్నా పనులు చేపట్టని కాంట్రాక్టర్

అమరచింత: ఆరేళ్ల కిందట అమరచింత నుంచి మూలమళ్ల గ్రామం వరకు ఉన్న కచ్చ రహదారికి బీటీ వేసేందుకు నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు మాత్రం ముందుకు సాగట్లేదు. నాలుగు కిలోమీటర్ల మేర బీటీ వేయడానికి ప్రభుత్వం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు చేపట్టక పోవడంతో ఇరు గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అమరచింత ఎత్తిపోథల పథకంతో పాటు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ద్వారా సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో ఇరు గ్రామాల రైతులు ఏడాదిలో రెండు పర్యాయాలు వరి పంటను మాత్రమే సాగు చేస్తున్నారు. పండించిన వరిధాన్యాన్ని మార్కెట్‌కు తరలించే యత్నంలో కచ్చ రహదారిపై ఉన్న గుంతల కారణంగా వర్షపునీరు నిల్వలతో ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా ధాన్యం తరలించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. అమరచింత పట్టణం నుంచి జూరాల ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లే వాహనాలు, పర్యాటకులు సైతం ఇదే రహదారిపై ప్రయాణం చేస్తుంటారు. బీటీ పనులు వెంటనే చేపట్టాలని పలుమార్లు పీజేపీ అధికారులకు విన్నవించినా ఇప్పటికీ పనుల్లో కదలికలు లేకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు వాపోయారు. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి తేకపోవడంతోనే బీటీ రహదారి పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.



అమరచింత నుంచి మూలమల్ల వెళ్లే కచ్చ రహదారి

కచ్చ రహదారితో ఇబ్బందులు

అమరచింత ఎత్తిపోథల ఆయకట్టు ద్వారా పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా అందుతుండటంతో వరి పంట సాగుచేస్తున్నాను. పొలానికి వెళ్లడానికి కచ్చ రహదారే శరణ్యం. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నాం. కొన్నిసార్లు గుంతలను తప్పించబోయి వాహనం అదుపు తప్పి కింద పడుతున్నాం. వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుంది. అధికారులు స్పందించి బీటీ పనులు త్వరితంగా పూర్తి చేయాలి.

– కృష్ణారెడ్డి, రైతు, అమరచింత